# ప్రేమే అసలైన సంపద



*శిఖిపింఛకావతంసా*

*వ్యాధవధూర్గర్వితాభ్రమతి*

*గజమౌక్తిక పరచిత*

*ప్రసాధనానాంపురః సపత్నీనాం*

*భావం:* మత్త గజ కుంభాలలో దొరికే ముత్యాల నగలు ధరించిన సవతుల మధ్య నెమలి ఈకలతో అలంకరించుకున్న బోయ వధువు గర్వంతో తిరుగుతోంది.

ఇంగ్లీషులో ' కీపింగ్ అప్ విత్ ది జోనెసెస్ ' అన్న ప్రయోగమొకటుంది. మన పక్కింటివాళ్ళతోనో, మిత్రులతోనో, బంధువులతోనో సమంగా ఉండాలన్న ఆరాటమన్న అర్థంలో ఆ పదాలను ఉపయోగిస్తారు. ఉదాహరణకి రమ ఇంట్లో వారందరూ తృప్తిగా, ఆనందంగా టి.వి. లో ప్రోగ్రామ్స్ చూస్తున్నారు. కానీ ఉమ వాళ్ళు ఈ మధ్యనే ప్లాస్మా టి.వి. కొనుక్కున్నారు. తమ ఇంట్లో కూడా ప్లాస్మా టి.వి లేకపోతే రమకి తలకొట్టేసినట్లనిపిస్తుంది. యువతరానికి మిత్రబృందంలో ఎవరైనా కొత్త షర్టు కాలరు చూసి ఏ బ్రాండ్ దో తెలుసుకుంటే కానీ తృప్తి ఉండదు. షర్టు గొప్పదనం రంగులోనూ, మన్నికలోనూ కాకుండా బ్రాండ్‌లోనే ఉంటుంది. ధనాన్ని బట్టే గౌరవించే సంస్కృతిలో ఖరీదైన వస్తువులూ, చీరలూ, నగలూ, డ్రెస్సులూ సమకూర్చాలంటే ఇంటి యజమాని గతి ఏమిటి? ఒక్క ఉద్యోగం తాలూకు సంపాదన చాలక పార్ట్ టైం జాబ్స్, కన్సల్టెన్సీలు వగైరాలతో ధనార్జన చెయ్యాలి. మగవారి లంచగొండి తనానికి స్త్రీల ఖర్చులే కారణమని ఒక నమ్మకం కూడా బలీయంగా ఉంది. సంపాదనలో పడిపోయిన భర్తలు భార్యలకు సమయాన్ని కేటాయించలేరు. అలా భర్త సంపాదన కాకుండా సమయాన్ని మాత్రమే కోరుకున్న భార్యలూ అక్కడక్కడ ఉంటారు.

అడవిలో బోయ నాయకుడు మహావీరుడు. ఒక్క వేటుతో మత్త గజాన్ని కొట్టగలిగేవాడు. ఒక్క బాణంతో వేగంగా పరిగెట్టే చిరుతను పడగొట్టేవాడు. అతని వీరత్వానికి మెచ్చి ఎందరో తమ పిల్లలనిచ్చి పెళ్ళి చేశారు. ఎందరోకన్యలు వలచి వరించారు. బహుభార్యాత్వం సామాన్యమైన కాలంలో అతడందరినీ సమానంగా చూసేవాడు. వేటాడిన ఏనుగుల కుంభ స్థలాల్లోని ముత్యాలనందరికీ ఇచ్చేవాడు. భార్యలు ఆ ముత్యాలతో నగలు చేయించుకుని అలంకరించుకునేవారు.

ఆ బోయ నాయకుడు చివరకు తనే ఒకమ్మాయి ప్రేమలో పడి ఆమెను వివాహం చేసుకున్నాడు. ఆమె సన్నిధిలో అతనికి ఆనందంగా గడచిపోయేది. ఆహారానికి వేట తప్పనిసరై సులభంగా దొరికే నెమళ్ళను వేటాడేవాడు తప్ప అడవి మధ్యకు వెళ్ళేవాడు కాదు. చిన్న భార్య నెమలి

ఈకల తోనే అలంకరించుకునేది. మిగతా భార్యలు ముత్యాల నగలు ధరించినా ఆమెకు అసూయ లేదు. భర్త ప్రేమకన్నా, సాన్నిహిత్యం కన్నా గర్వించతగినదేముందని ఆమె అభిప్రాయం.

ఈనాడు బహుభార్యాత్వం లేదు. సవతులతో పోలిక లేదు. కానీ ఇతర స్త్రీలతో పోలికా, వారిలా నగలూ, వస్తువులూ, చీరలూ అమర్చుకోవాలన్న ఆరాటమే రాజ్యం చేస్తోంది. నేటి స్త్రీలు ప్రేమానురాగాలూ, సాన్నిహిత్యమూ ముఖ్యమని అమాయకురాలయిన బోయ వధువుని చూసి గ్రహిస్తే మల్టీ నేషనల్స్, క్రెడిట్ కంపెనీలూ తోక ముడవాల్సిందే కదా. భక్తితో ఇచ్చిన పత్రం, పుష్పం, ఫలం, తోయం, కూడా నాకు ప్రీతిపాత్రాలన్న శ్రీకృష్ణుని ఆరాధించే సంప్రదాయం మనది. వస్తువులని ఖరీదుతో అంచనా వెయ్యరాదు.

******